కథ

# రిపోర్టు

వి. సంపత్ రెడ్డి

ఆ రోజు న్యూస్ పేపరు చూశాను. రాజకీయ నాయకులు ఇచ్చిన వాగ్దానాలతో, ఎవరెవరు ఏ పార్టీలు మారుతున్నారో ఊహాగానాలతో, ఎక్కడ ఎన్ని హత్యలు జరిగాయి? ఈ నెలలో ముఖ్యమంత్రి ఎన్నిసార్లు ఢిల్లీ వెళ్ళివచ్చారు? ఈ నెలలో విడుదలైన సినిమాలెన్ని? ఎవరు, ఎవరిమీద ప్రతీకారంతో బాంబులు వేశారు? ఈ ప్రతీకార దాడిలో ఎన్ని గుడిసెలు దగ్ధమైనాయి? అనే వార్తలతో వేడిక్కి ఉన్న న్యూస్ పేపర్‌ను చూసి టీపాయ్ మీద పడేశాను. అప్పుడు నాకు ఒక వార్త కనిపించింది. "వరంగల్‌లో విద్యుత్ ఆఫీస్‌పై దాడి" అని తాటికాయంత అక్షరాలు కనిపించాయి. ఆ వార్తను చూడగానే ఈ రోజు ఆఫీసులో కచ్చితంగా పని ఉంటుందని అనిపించి ఆఫీస్ వైపుకు సాగాను.



నేను ఇంటెలిజెన్స్ ఆఫీసర్‌ని. గ్రాడ్యుయేషన్ పూర్తికాగానే ఎంట్రన్స్ పరీక్ష రాసి ఈ ఉద్యోగంలో జాయినయ్యాను. నా వద్దనే అమ్మ, నాన్న ఉంటారు. నానా వాళ్ళు ఇద్దరన్నదమ్ములు. పెద్దనాన్న వాళ్ళు మా స్వంత ఊరిలో వ్యవసాయం చేసుకుంటూ ఉంటారు. ఆ ఊరికి వెళ్ళాలని ఉంది. కాని ఎప్పుడూ వెళదామనుకున్నా ఏదో ఒక పని ఉండటం వల్ల వెళ్ళలేకపోయాను. ఎన్నోసార్లు ఆఫీసర్‌ను అడిగాను. అయిన ఆయన నాకు సమాధానం ఇవ్వలేదు. సరేలే అని ఊరుకున్నాను.

ఆఫీసర్ గారి దగ్గరనుండి పిలుపొచ్చింది. నేను ఆఫీసర్ గారి రూమ్‌లోకి వెళ్ళి సెల్యూట్ చేశాను. ఆ తరువాత ఆయన సూటిగా విషయంలోకి వచ్చి అసలు విషయం చెప్పి ఒక ఫైలు ఇచ్చారు. ఆ ఫైల్ నేను చదివాను. అందులో ఉన్న విషయం సూటిగా చెప్తున్నాను. రాష్ట్రంలో ఎన్నో ఉద్యమాలు వచ్చాయి. సారా వ్యతిరేక ఉద్యమం, రిజర్వేషన్‌ల అనుకూల, వ్యతిరేక ఉద్యమాలు మొదలైనవి. ఇప్పుడు ఉధృతమవుతున్న కరెంటు కోత వ్యతిరేక ఉద్యమాలకు, ధర్నాలకు కారణాలు ఏమిటో తెలుసుకొని, రైతులు చేస్తున్న ఈ ఆందోళనల వెనుక ఎవరివైనా హస్తాలు ఉన్నాయో తెలుసుకొని రిపోర్టు తయారు చేసి ఇవ్వాలి అని. ఈ ఫైలు చేతపట్టుకొని ఆఫీసు నుండి ఇంటికి బయలుదేరాను రేపు ఏం చేయాలో ఆలోచిస్తూ.

ఇంటికి వెళ్ళిన తరువాత అమ్మా నాన్నలకు ఈ విషయం చెప్పాను. అలాగే మన ఊరికి కూడా వెళుతున్నానని చెప్పాను. వాళ్ళు చాలా సంతోషపడ్డారు. నాకు ఉద్యోగం వచ్చాక అమ్మా నాన్నలను నాదగ్గరికి తీసుకొని వచ్చాను. మా పొలాన్ని మా

పెద్దనాన్నా వాళ్ళు సేద్యం చేస్తున్నారు. ఏది ఏమైనా ముందుగా మా ఊరికెళ్ళాలని నిశ్చయించుకొని నిద్రలోకి జారుకున్నాను.

మరునాడు ఉదయం ఐదు గంటలకు బస్‌స్టేషన్‌కు వెళ్ళాను. నేను వెళ్ళే బస్సు ఫ్లాట్ ఫారమ్‌పై సిద్ధంగా ఉండడంతో వెళ్ళి బస్సులో కూర్చున్నాను. రెండు గంటలు ప్రయాణం చేస్తే ఊరు దగ్గరకు చేరుకోవచ్చు అని అనుకుంటుండగానే బస్సు వేగాన్ని అందుకొని ముందుకు దూసుకుపోయింది. నా మనస్సు గత జ్ఞాపకాలను నెమరువేసుకుంటానంటూ వెళ్ళిపోయింది.

** ** ** ** **

నేను నా స్నేహితులతో కలిసి గోళికాయలు ఆడుకుంటున్నాను. అంతలోనే మాలో ఒకడు "ఒరేయ్ తాత వస్తున్నాడురా" అని అనగానే ఎవిరి గోళికాయలు వాళు ఏందుకుంటూ దిక్కులు చూడకుండా వరుగెత్తాం. ఆ తాత అంటే ఊళ్ళో వాళ్ళందరికి భయం. అతని కోర మీసాలు చూడగానే భయం గొలిపేటట్లుగా ఉంటాయి. ఆయన ఎవ్వరిని ఏమనడు. అయినా ఆయన అంటే అందరికి భయం.

నా దురదృష్టం కొద్ది ఆయన వస్తున్న వైపే నేను వరుగెత్తాను. ఆయనను చూడగానే నా నిక్కరు తడిసిపోయింది. అది చూసి ఆయన నవ్వాడు. ఇక నేను వరుగు అందుకొని ఇంట్లో వడటంతో సంతోషంగా ఉన్నట్లు అనిపించింది.

ఆ తాత ఆ రోజు మా ఇంటికే రావడంతో బయటకెళ్ళలేక ఆయనను తిట్టుకున్నాను. ఆయన వెళ్ళిపోయాక నా ముఖ కవళికలను నాన్నా గమనించి దగ్గరకు తీసుకొని తాత గురించి చెప్పాడు. తాత హెచ్.ఎస్.సి. పాసయ్యాడని, అతనికి టీచర్ ఉద్యోగం వస్తే వాళ్ళ నాన్నా చెప్పిన మీదట మానుకున్నాడని, అతను గొప్ప విజ్ఞాని అని, అతనికి చాలా విషయాలు తెలునునని చెప్పడంతో తాత అంటే నాకు గౌరవ భావం కల్గింది.

అప్పటి నుండి నేను, మెల్లమెల్లగా తాతతో మాట్లాడి మంచి విషయాలు తెలునుకోవడానికి ప్రయత్నించాను. రానురాను మా ఇద్దరి మధ్య గాఢమైన అనుబంధం పెరిగింది. రోజు నాకు తెలియని క్రొత్త క్రొత్త విషయాలు చెప్పేవాడు. గణితం, భూగోళం, ఖగోళం ఒక్కటేమిటి అనేక విషయాల మీద ఆగకుండా అడిగిన ప్రశ్నలకు వెంటనే సమాధానాలిచ్చేవాడు. అంతేకాకుండా సమాజం గురించి, సమాజంలో ఉన్న స్వార్థాస్వార్థాలు, న్యాయాన్యాయాలు, ధర్మాధర్మాలు, ఇంకా చాలా విషయాలు చెప్పేవాడు. ఇన్ని విషయాలు తాత దగ్గర నేర్చుకున్న తరువాత మెల్లగా ఇంటికి బయలుదేరేవాడిని.



"ఈ ఊరు వచ్చేటప్పుడు ఒక జత బట్టలతో వచ్చాను ఇప్పుడు "పది వేలు" సంపాదించాను" రంగనాథం గుర్నాథంతో చెప్తున్నాడు.

"అయ్ బాబోయ్" పది వేల బట్టలు సంపాదించావా?" ఎందుకు? ఆశ్చర్యంగా ప్రశ్నించాడు గుర్నాథం.

బి. భరద్వాజ్

[కొమరిపాలెం]

తాత దగ్గర చాలా విషయాలు నేర్చుకుంటూనే ఇంకొక ప్రక్క స్నేహితులతో కలిసి గోళికాయలు ఆడేవాడిని. కోతి కొమ్మచ్చి, దూకుడు బిళ్ళ మొదలగు ఆటలు ఆడిన తర్వాత చెఱువుకు వెళ్ళి ఈత కొట్టేవాళ్ళం.

ఇలా ప్రశాంతంగా సాగిన నా బాల్యం ఊరిలో చదువు అయిపోవడంతో నాన్నగారు నన్ను పట్నానికి పంపించారు. ఆ రోజు ఊరును వదిలిపెట్టినపుడు, ముఖ్యంగా తాతను వదిలిపెడుతున్నందుకు చాలా బాధ కల్గింది.

ఆ తరువాత పట్టణంలో డిగ్రీ పూర్తిచేసి, ఈ ఉద్యోగంలో జాయినయ్యాను.

కండక్టర్ అరిచిన అరుపుతో నా మనస్సు ఈ లోకంలోకి వచ్చింది. నా బ్యాగ్ భుజాన వేసుకుని నేను రావలసిన స్టేజీ రావడంతో దిగాను. ఆ స్టేజి నుండి మా ఊరుకు ఒక కిలోమీటరు నడిచివెళ్ళాలి. అక్కడ నుండి నడుచుకుంటూ ఊరిలోకి వెళ్ళగానే శరీరం జలదరించినట్లనిపించింది. ఎవరైనా స్నేహితులు కనబడతారేమోనని చూశాను. కానీ ఎవరు కనిపించకపోవడంతో నిరాశతో ముందుకు వెళుతున్నాను. అప్పుడు దారిన వెళ్ళేవాళ్ళంతా "ఈయన ఎవరు?" అంటూ ప్రశ్నార్థ ముఖాలతో చూస్తున్నారు. వాళ్ళలో వాళ్ళే గుసగుసలాడుకుంటూ ఎవరిదారిన వారు వెళ్ళిపోతున్నారు. వాళ్ళను చూస్తుంటే నా పెదాలపై చిఱునవ్వు వచ్చింది. అలా ముందుకు సాగి పెద్దనాన్నా వాళ్ళ ఇంటిమెట్లు ఎక్కి తలుపుతట్టాను. 'ఎవరు'? అనుకుంటూ తలుపు తీసిన పెద్దమ్మ మొదట ఆశ్చర్యపోయి తరువాత తేరుకుని యోగాక్షేమాలడిగి లోపలికెళ్ళింది. అప్పుడే లోపలికొచ్చిన పెద్దనాన్నా అన్నలు కూడా యోగా క్షేమాలు అడిగారు. అమ్మా, నాన్నాలు చెప్పిన విషయాలు చెప్పిన తరువాత వాళ్ళు సంతోషపడ్డారు. పెద్దమ్మ తెచ్చిన నీళ్ళతో కాళ్ళు, చేతులు, ముఖం శుభ్రం చేసుకుని ఇంటి ముందున్న చింతచెట్టు క్రింద కూర్చున్నాను. అప్పుడు నేను వచ్చిన విషయం గుర్తుకువచ్చింది. ఇక్కడ ఏమైనా విశేషాలు ఉంటే తెలుసుకోవాలని ఉబలాటం ఉన్నా బోజనాల సమయం వరకు ఆగాలనిపించింది.

నేనేమీ ఉద్యోగం చేస్తున్నానో పెద్దనాన్న వాళ్ళకు తెలియదు. కాని నేను ఏదో ఉద్యోగం చేస్తున్నానని మాత్రం తెలుసు. నేను ఇక్కడికి వచ్చినదానికి సంబంధించి ఇక్కడ ఏమైనా సమాచారం దొరుకుతుందేమోనన్న ఆశతో 'ఇక్కడ పరిస్థితులు ఎలా ఉన్నా'యని అడిగాను. దానికి పెద్దనాన్న 'ఇక్కడి పరిస్థితులు ప్రత్యక్షంగా తెలుసుకోవాలంటే ఒక గంట వరకు వేచి చూడు" అని అనగానే చేసేదేమీలేక భోజనం ముగించి ఆ సమయం ఎప్పుడు వస్తుందా అంటూ చింతచెట్టు క్రింద కూర్చున్నాను.

గంట కాకముందే అక్కడికి నేను ముందు చెప్పిన తాత వచ్చాడు. తాతను చూడగానే మళ్ళీ గత విషయాలు జ్ఞప్తికొచ్చాయి. తాత మునుపటిలా లేడు. కోర మీసాలు అలాగే ఉన్నా ఇప్పుడ చూస్తే మాత్రం భయం కలుగడంలేదు. తాతను చూసి యోగాక్షేమాలడిగాను. అతను గుర్తుపట్టి ఆనందంతో దగ్గరకు తీసుకున్నాం. తరువాత ఆ విషయాలు, ఈ విషయాలు మాట్లాడుకున్నాము. అప్పటికే ఒక్కొక్కరుగా ఊరిలోని రైతులందరూ చింతచెట్టు క్రిందికి చేరుకుంటున్నారు. ఎందుకంటే 'ఆ ఊరిలో పంచాయతీ జరిగినా, సమావేశం జరిగినా' అక్కడే జరుగుతుంది. అప్పుడు నా లోని ఆఫీసర్ మేల్కొన్నాడు. వీళ్ళని చూస్తుంటే పేపరులో చదివినా వార్త గుర్తుకు వచ్చింది. అయినా ఏమి జరుగుతుందో చూద్దాం నేను ఒక ప్రక్క కూర్చున్నాను.

సమావేశం మొదలయ్యింది. ఒక్కొక్కరు వచ్చి వాళ్ళ కష్టాలు చెప్పుకుంటున్నారు. ఒకరేమో నా పొలం ఎండిపోయింది. నేనెలా బ్రతకాలి, షావుకారి అప్పు ఎలా తీర్చాలి. అని ఏడుస్తూ చెప్పాడు. పంట నేలపాలయిందని కొందరు వాళ్ళవాళ్ళ బాధలు చెప్తున్నారు. అధికారులను దుమ్మెత్తిపోశారు. ఇక నేను అనుకున్నాను వరంగల్‌లో జరిగిన పని మళ్ళీ పునరావృతమవుతుందేమోనని. కాని అక్కడి విషయాలు చూస్తే అలాంటి పనులు జరుగవని అనిపించింది. ఇంతలోనే సభలో కలకలం బయలుదేరింది. ఇప్పుడు తాత మాట్లాడతారని అధ్యక్షులుగా ఉన్నవారు ప్రకటించారు.

తాత వెనుక నుండి రావడానికి చాలా ప్రయత్నిస్తూ ముందుకు వెళ్ళాడు. అందుకే సభలో కలకలం. ఆయనంటే ఊరివారందరికి ఇంకా గౌరవం ఉన్నట్టనిపించింది. తాత నోటి నుండి ఉపన్యాసం విని చాలా రోజులయింది కాబట్టి ఉపన్యాసాన్ని వినడానికి ప్రాముఖ్యత నిచ్చాను. తాత తన సహజ గంభీరత్వంతో మాట్లాడటం ప్రారంభించాడు. "భరత భూమి పుణ్యభూమి, వేదభూమి కర్మభూమి. ఇలాంటి దేశంలో మనం జన్మించడం మన అదృష్టం. ఈ దేశం వేల సంవత్సరాల నుండి పాడిపంటలతో, పచ్చనిపొలాలతో, ధాన్యాగారాలతో, ఎటు చూచినా పచ్చదనంతో నిండి ఉన్న చేలతో, అడవులతో తులతూగుతుండేది. అలాంటి సస్యశ్యామల భారతావనిలో అన్నపూర్ణగా పేరుగాంచిన ఆంధ్రదేశం, భారతావని కీర్తి కిరీటాలలో ఒక కలికితురాయిగా ఉంది.

అన్నపూర్ణగా పేరుగాంచిన ఆంధ్రదేశం నేడు ఆకలి మంటల కేకలతో, తిండిలేక చితికిపోయిన జీవితాలతో ప్రజలు ఉంటున్నారనడంలో ఏ మాత్రం సందేహం లేదు. సస్యశ్యామలంగా ఉన్న నాటి నేల నేడు బీడుగా మారింది. ఎక్కడ చూచినా పల్లేరు కాయలు, ఎండుపుల్లలు మాత్రమే కనబడుతున్నాయిగాని పచ్చదనంతో నిండి ఉన్న పొలాలు కాని, తోటలు కాని ఎక్కడా కనిపించడం లేదు.

ఎక్కడైనా తోటలు, పొలాలు కనపడ్డా, దిగుబడి పెట్టుబడి కంటే తక్కువయిపోయి రైతు నష్టాలకు గురై హీనస్థితికి చేరుకుంటున్నాడు. ఆంధ్రావనిలో సస్యశ్యామలం లేకుండా పోయింది.

నాటి అన్నపూర్ణ ఆంధ్రావని నేడు ఆకలితో అలమటించే ఆంధ్రావనిగా మారింది. నాడు నలుదిక్కులా వేదాలు వినిపించిన ఈ దేశంలో నేడు అభాగ్యుల ఆక్రందనలు, ఆకలి చావుల కేకలు వినపడుతున్నాయి.

తిండికోసమైనా గింజలు రావా అన్న ఆశతో అంతో ఇంతో కష్టపడి ఈ బీడు పొలాలలో పంటలు వేసినాం. ఇంకో నెలరోజులయితే తిండిగింజలు వస్తాయని అనుకుంటే, అది అత్యాశ అవుతుందని ఇప్పుడు అనుకోవాల్సి వస్తుంది. కరెంటు లేక ఇప్పటికే నాల్గు రోజులు అయింది. పొలాలు అన్ని ఎండిపోతున్నాయి. రోజుకు కనీసం ఐదు గంటలు కూడా కరెంటు

ఉండడం లేదు. నిన్న నేను కరెంటు ఆఫీసుకు పోయి కనుక్కున్నాను. అసలు కరెంటు పై నుండే రావడం లేదన్నారు. నేను నిన్నటి పత్రిక చూస్తే అందులో ఏమున్నదంటే అసలు కరెంటు కోత లేదని. రాష్ట్రంలోని జలాశయాలు నిండి ఉన్నాయట. అసలు ఎక్కడ ఏది ఉంటే మనకేమిటి గాని, ఈ రోజు మనం విద్యుత్ ఆఫీసు దగ్గరికి పోయి అసిస్టెంట్ ఇంజనీరుగారికి కరెంటును ఎక్కువసేపు ఇవ్వమని కోరుతూ విజ్ఞాపన పత్రం ఇద్దాం. తాత మాటలకు అందరూ ఒప్పుకున్నారు. నేను చేయవలసిన పని ఇక్కడే జరుగుతుంటే చుట్టూ చూస్తూ పరిశీలిస్తున్నాను.

తరువాత నా దగ్గరకు తాత వచ్చి గత విషయాలు చెప్పుకుంటూ "నా చిన్ననాటి రోజులే మంచివి. అప్పుడు ఉదయాన్నే చద్దన్నం పట్టుకొని పోయి మోట కొట్టుకొనేటోళ్ళం. పొలంలోకి నీళ్ళు నిండుగా వచ్చిన తరువాత మోట కొట్టడం ఆపేసి పొలం పనులు చేసేవాళ్ళం. మోట కొడుతున్నప్పుడు మధ్యలో కొద్దిసేపు ఆపి చద్దన్నం తినేవాళ్ళం. అప్పుడే పంటల దిగుబడి ఎక్కువ ఉండేది. ఇప్పుడు చూడు కరెంటు ఉంటేనే నీళ్ళు, లేకపోతే పొలం ఎండిపోవడం ఖాయం. ఈ దరిద్రపు కరెంటు మన ఊరికి ఎందుకు వచ్చిందా అంటూ అపుడపుడూ బాధపడతాను" అని అంటూ ఎవరో పిలవడంతో ప్రక్కకు వెళ్ళిపోయాడు.

విజ్ఞాపన పత్రాన్ని వ్రాసి తయారు చేసుకొని వచ్చారు కొందరు. అందులోని ముఖ్యమైన డిమాండ్ ఏమిటంటే రోజుకు కనీసం 10 గంటలైనా కరెంటు సరఫరా చెయ్యాలి. ఉదయం ఐదు గంటలు, సాయంత్రం ఐదు గంటలు నిరంతరాయంగా కరెంటును సరఫరా చేయాలి. రైతులందరూ కలిసి విద్యుత్ ఆఫీసుకు వెళుతుండడంతో వారి వెంట నేను వెళ్ళాను. రైతులందరూ కలిసి విద్యుత్ ఆఫీసును చేరి వారి విజ్ఞాపన పత్రాన్ని ఇవ్వడానికి ప్రయత్నించగా, అసిస్టెంట్ ఇంజనీరు బయటకు రాక వాళ్ళ విజ్ఞాపన పత్రాన్ని తీసుకోవడానికి నిరాకరించడంతో కొంతమంది రైతులు ఆవేశానికి లోనయి లోపలకెళ్ళడంతో గందరగోళం ఏర్పడింది. అప్పుడు ఆఫీసులో కుర్చీల చప్పుళ్ళు, ఉద్యోగుల హాహాకారాలు వినిపించడంతో ఆఫీసును ధ్వంసం చేస్తున్నారని అర్థమయ్యింది. నా దగ్గర ఉన్న తాత నా వైపు ప్రశ్నార్థకమైన భావంతో చూస్తున్నాడు. ఇలాంటి విషయమేదో ముందుగానే జరుగుతుందని ఊహించాను. ఎందుకంటే మేము వస్తున్నప్పుడు రైతులు మాట్లాడిన మాటల వల్ల ఎందుకైనా మంచిదని పోలీస్‌స్టేషన్‌కు ఈ విషయం తెలిపాను. అయినా పోలీసులు ఇంకా రాలేదు. ఆఫీసు ధ్వంసం అయినాక వచ్చిన పోలీసులకు అన్ని విషయాలు చెప్పాను. కాని అంతకుముందే అక్కడున్న రైతులందరూ జారుకున్నారు.

ఆ తరువాత పోలీసులు వాళ్ళని అరెస్టు చేయడం, కోర్టులో హాజరుపరచడం, బెయిల్ దొరకడం వెంటవెంటనే జరిగాయి. అప్పుడు పెద్దనాన్నా వాళ్ళ దగ్గర సెలవు తీసుకొని ఇంటికి వెళ్ళి రిపోర్టు తయారు చేశారు.

నేను తయారు చేసిన రిపోర్టును పట్టుకొని ఆఫీసుకు వెళ్ళాను. ఆఫీసర్ గారు నా కోసం ఎదురు చూస్తున్నారు. ఎందుకంటే జరిగిన సంఘటనతో ఆయన మీద చాలా ఒత్తిడి పెరిగింది. నేను ఆయనకు సెల్యూట్ చేసి కూర్చున్నాను.

"ఎవరు ఆ ఉద్యమం వెనుక ఉన్న వ్యక్తులు"? అన్నాడు. "ఎవరు లేర"ని చెప్పడంతో ఆయన ఆశ్చర్యపోయాడు. ఇంత పెద్ద ఉద్యమం వెనుక ఎవరూ లేరా అన్న సందేహాన్ని వ్యక్తపరచగానే "లేరు" అని చెప్పాను. "ఆ ఉద్యమం వెనుక రైతుల కష్టాలు" ఉన్నాయని చెప్పాను. పూర్తి వివరాలతో కూడిన ఫైలు అందచేసిన తరువాత ఆ ఉద్యమం ఎందుకు లేచిందో వివరించాను.

వాళ్ళకు నాయకులు అవసరం లేదని, వాళ్ళ కష్టాలు వాళ్ళకు తెలుసని చెప్పాను. ఏ దేశంలో కూడా రైతు తిరగబడడు. తిరగబడితే ఆ దేశం పరిస్థితి ఏమిటో తెలుస్తుందని, రైతు తిరగబడ్డ దేశంలో ఆకలి మంటలు అని చెప్పాను. ఇప్పుడు వచ్చిన ఉద్యమం రైతుల మండే గుండెల నుండి, నిరాశనిస్పృహల నుండి, ఆకలి మంటలతో అల్లాడుతున్న రైతన్నల గుండెలు మండి వచ్చిన ఉద్యమం ఇదని, నెల రోజులలో పంట కోత కొస్తుందని తెలిసి చాలా ఆనందపడి తిండి దొరుకుతుందనే ఆశతో ఉన్న రైతుకు, కరెంటు సరఫరా లేనందువల్ల ఆ పంటలు ఎండిపోతుంటే రైతన్నల మండే గుండెల నుండి వచ్చిన ఉద్యమమని, నోటి వద్ద నుండి తిండిని కాకులు ఎత్తుకొని పోయినట్లు విలవిలలాడిన రైతన్నలు చేస్తున్న ఉద్యమమని చెప్పాను. అంతేకాకుండా వాళ్ళ పంట పొలాలు బీడు భూములుగా మారకుండా ఉండాలంటే ఈ ఉద్యమం లేపక రైతన్నలకు తప్పలేదని, ఈ ఉద్యమం వెనుక ఎవరు లేరని, ఎలాంటి స్వార్థశక్తులు లేవని చెప్పాను. ఆయన నన్ను భుజం తట్టి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాను అనడంతో నాకు సంతోషం అయింది.

కనీసం నేనిచ్చిన రిపోర్టు వల్లనయినా ప్రభుత్వం రైతులకు కరెంటును సరఫరా చేసి, వాళ్ళ కష్టాలను తీరుస్తుందనే ఆశతో ఇంటి ముఖం పట్టాను. ●

---

# మెదడులో మ్యాప్‌లు

మెదడులో మాపులుంటాయి. ఇవి మనం ప్రపంచాన్ని అవగాహన చేసుకుందుకు తోడ్పడతాయి. చూడడం, వినడం, స్పర్శ మొదలైన జ్ఞానవ్యవస్థలు ప్రతిఒక్కదానికి ప్రత్యేక న్యూరాన్ లుంటాయి. ఇవే ఈ మాప్‌లను తయారుచేయడంలో పాత్ర వహిస్తాయి. మానవులు బాహ్యప్రపంచంలో ప్రతిచర్య జరపడంలో నిరంతరం ఈ మాపుల సహాయం తీసుకుంటారు. కలల్లో కూడా ఇవే కణాలు క్రియాత్మక మవుతాయిగాని అప్పుడు అవి బాహ్యప్రపంచంలోని సంకేతాలకు ప్రతిచర్య జరపవు. మెదడు తన లోపలినుంచి తన సంకేతాలను తానే ఉత్పాదించుకుని, వాటికి ప్రతిచర్య జరపడానికి ప్రయత్నిస్తుంది.

ఈ మాపింగ్ చర్యలు నిర్వహించే న్యూరాన్‌కు గ్రాహక క్షేత్రాలుంటాయి. ఉదాహరణకి దృశ్యవ్యవస్థలో క్షితిజ సమాంతర రేఖలను మాత్రమే గుర్తించే కణాలు కొన్ని నిట్టనిలువు రేఖలను గుర్తించే కణాలు మరికొన్ని వుంటాయి. క్షితిజ సమాంతర రేఖలకు గ్రాహకక్షేత్రమున్న న్యూరాన్‌కి నిలువులేదా ఏటవాలు రేఖలు లేదా ఇతర ఆకారాలు ఎదురయినప్పుడు, అది ఇతర న్యూరాన్‌లకు సంకేతాలు పంపదు. క్షితిజ సమాంతర రేఖలకే అది ప్రతిచర్య జరుపుతుంది. రంగు, చలనం మొదలైన అంశాలను తెలపటానికి ప్రత్యేక కణాలుంటాయి. ఒక వస్తువు ఏమిటో తెలిపే కణాలు కొన్ని అది ఎక్కడవుందో తెలిపే కణాలు కొన్నివుంటాయి. అలాగే మన శరీర భాగాలు ఎక్కడున్నాయో తెలిపే కణాలు కొన్ని వుంటాయి. మన చేతివైపు వేగంగా వస్తున్న బంతిమార్గాన్ని వేగాన్ని నిర్ణయించే కణాలు కొన్ని వుంటాయి. ఈ మాపులన్నీ బాహ్య ప్రపంచం యొక్క ప్రాదేశిక సూచనలన్నమాట. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో న్యూరోబయాలజి ప్రొఫెసర్‌గా వున్న డా. ఎరిక్‌ముడ్‌సన్ ఈ విషయాలు తెలియజేశారు.

చిన్న చిన్న గ్రాహకక్షేత్రాలు గల ఈ ప్రత్యేక కణాలు అవి మాప్ చేసిన సమాచారాన్ని వివిధ నెట్‌వర్క్‌ల ద్వారా వల్కలానికి పంపుతాయి. వల్కలమంటే మెదడు శీర్షభాగంలో వుండే కణాల పలచనిపొర. ఇక్కడే ఉన్నతస్థాయి ప్రక్రియ జరపబడుతుంది. తరవాత అదే నెట్‌వర్క్ ద్వారా అంతిమ గుర్తింపు లేదా అవగాహన కోసం వెనక్కు పంపడం జరుగుతుంది.

ఈ నమూనా అందరికీ బాగా నచ్చడం వల్ల శ్రవణ వ్యవస్థలో ఇదే రకమైన ప్రాదేశిక మాప్‌లుంటాయని పరిశోధకులు అనుకున్నారు. నిజానికి ఉన్నాయి కూడా. లోపలి చెవి శబ్దాల పౌనఃపున్యం, కాలం, స్థాయిని మాప్ చేస్తుంది. అప్పుడు ఆ సంకేతాలను మధ్యమెదడుకు పంపడం జరుగుతుంది. శబ్దం స్థానాన్ని నిర్ణయించడానికి అక్కడ ప్రక్రియ జరుగుతుంది. ఒక్కొక్క చెవి నుంచి వచ్చే శబ్దాల తీవ్రతను, కాలాన్ని మెదడు పోల్చి చూసుకుంటుంది. ఒక శబ్దం ఒక చెవికి రెండో చెవికన్నా ముందు చేరితే ఆ కాల వ్యత్యాసాన్ని బట్టి మెదడు ఆ శబ్దం మూలాన్ని నిర్ణయిస్తుంది. అందుకే ఒక చెవిలో, కొంచెం చెముడు ఉన్న వారికి కొంచెం ఇబ్బంది కలుగుతుంది. శబ్దాన్ని గుర్తించే పని శ్రవణవల్కలంలో జరుగుతుంది. ఆ శబ్దం నుంచి మనం దూరంగా పారిపోవాలా లేదా దాని వైపుదగ్గరగా పోవాలా అనే జ్ఞానం మనకి అక్కడే లభిస్తుంది. పక్షవాతం వల్ల శ్రవణ వల్కలంలో కొంత ప్రాంతం దెబ్బతింటే వారికి శరీరానికి ప్రతిముఖంగా ఉన్న శబ్దాల స్థానాన్ని గుర్తించే శక్తిపోతుంది.

శబ్దస్థానం, శబ్దచలనం, ప్రతిధ్వనులు మొదలైన వినికిడిలో వివిధ అంశాలను గుర్తించేందుకు ప్రత్యేక కణాలు ఉండవచ్చు. అయితే శబ్దగ్రహణానికి ప్రాదేశిక మాప్‌ల అవసరం లేకపోవచ్చని ఇటీవల కొందరు శాస్త్రవేత్తలు కనుక్కున్నారు. ఈ విషయంలో శబ్దగ్రహణం, దృష్టి, స్పర్శ వంటి ఇతర జ్ఞానాలకు భిన్నమైనదని వారు అంటున్నారు. ప్రత్యేకించి ఫ్లోరిడా యూనివర్సిటీ మెదడు పరిశోధనా సంస్థకు చెందిన డా. జాన్ సి.మిడిల్ బ్రూక్స్ పరిశోధనల ప్రకారం శ్రవణ వల్కలంలోని కణాలు నాడీ వ్యవస్థలోని ఇతర కణాలన్నింటికన్నా భిన్నమైనవని ప్రతిపాదించారు.

ఈ ప్రత్యేక కణాలు మానవ శరీరం చుట్టూ 360 డిగ్రీల ప్రదేశంలో శబ్దం ఎక్కడ సంభవించినా గుర్తించగలవు. ఈ శబ్దాల స్థానాన్ని నిర్ణయించడానికి అవి ఒక ప్రత్యేక కోడ్ లేదా సంక్షిప్త సంకేతాన్ని అభివృద్ధి చేసుకున్నాయి. ఉదాహరణకి ఒక వ్యక్తి తలకు ఎడమవైపుగా 10 అడుగుల దూరం నుంచి ఒక శబ్దంవస్తే అవి ఒక పద్ధతిలో సంకేతాలు జారీ చేస్తాయి. కాగా శబ్దం వేరే దిశ నుంచి వస్తే అవి వేరే విధంగా సంకేతాలు జారీ చేస్తాయి.

మొత్తం మీద మన జ్ఞానేంద్రియాల పనులను నిర్వర్తించడంలో మెదడు పాత్ర ఎంత సంక్లిష్టమైనదో దీన్ని బట్టి ఊహించవచ్చు.

-ఆర్.ఎల్.ఎన్ శాస్త్రి